సాక్షి కామారెడ్డి

గురువారం । 19 । జూన్ । 2025



భూ సమస్యల పరిష్కారానికే..

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు.

- 8లో ▸



అందని వైద్యం

పశువైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో మూగ జీవాలకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.2 /23.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. బలమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య'



బాన్సువాడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని జిల్లా విద్యాధికారి రాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు ఉపయోగించుకోవాలన్నారు. బాగా చదివి ఉన్నత స్థానానికి చేరాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు సంతోషి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శంభ్యనాయక్, సురేందర్, హరిశ, సుజాత, జమున, సంగీత తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి అవసరాలకు 'సాగర్' జలాలు



నిజాంసాగర్: నిజామాబాద్, బోధన్, బాన్సువాడ పట్టణ ప్రాంత ప్రజల తాగు నీటి అవసరాల కోసం బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ఇరిగేషన్ గేట్ల ద్వారా ప్రధాన కాలువకు 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువకు విడుదల చేస్తున్న నీటిని డిస్ట్రిబ్యూటరి తూముల ద్వారా వృథా చేయకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. బెల్లాల్ చెరువుతో పాటు అలీసాగర్ రిజర్వాయర్ వరకు 0.3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. మూడు రోజుల పాటు ప్రధాన కాలువ నీటి విడుదల కొనసాగనుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రం వరకు 1,393.78 అడుగుల(6.3 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

షబ్బీర్‌అలీని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి



కామారెడ్డి టౌన్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిశారు. ఆయనను సన్మానించారు. అలాగే ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావులను కలిసి సన్మానించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు రవి, శ్రీనివాస్, పాత శివకృష్ణమూర్తి, చాట్ల వంశి, మమత, సాయిబాబా, సలీం, రమేష్, మహేష్, ప్రసాద్ తదితరులున్నారు.

మంత్రిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



కామారెడ్డి టౌన్: రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని బుధవారం డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు హైదరాబాద్‌లో కలిశారు. ఆయనను సత్కరించారు. ఆయన వెంట జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఉన్నారు.

దోస్త్ ప్రత్యేక కేటగిరి ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు 2025–26 విద్యాసంవత్సరానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను బుధవారం పరిశీలించినట్లు కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ అడ్మిషన్స్ కార్యాలయంలో ధ్రువపత్రాలను పరిశీలించారు. ప్రత్యేక కేటగిరీ పీహెచ్‌సీ, సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్‌కు సంబంధించి ఎన్‌సీసీలో ఆరుగురు, స్పోర్ట్స్‌లో ముగ్గురు, సీఏపీలో ముగ్గురు విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.



రుణమాఫీ అంతేనా!?

- జిల్లాలో 98 వేల మందికి అందని లబ్ధి
- పట్టించుకోని సర్కారు.. పాలకులను నిలదీయని ప్రతిపక్షాలు
- నిరాశలో రుణమాఫీ కాని రైతులు

అధికారంలోకి వస్తే రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ.. పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కుటుంబం యూనిట్‌గా తీసుకోవడం, ఇతర కారణాలతో జిల్లాలో సగం మందికి ప్రయోజనం దక్కలేదు. ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. ప్రతిపక్షాలు సైతం ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. దీంతో లబ్ధి చేకూరని రైతులు నిరాశ చెందుతున్నారు. – కామారెడ్డి క్రైం

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో పంట రుణాల మాఫీ కీలకమైనది. ఆ పార్టీనే అధికారంలోకి రావడంతో రుణ విముక్తులమవుతామని రైతులు ఆశించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత విధివిధానాల పేరుతో చాలా సమయం తీసుకుంది. కుటుంబం యూనిట్‌గా రూ. 2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామంటూ కొర్రీలు పెట్టి అర్హుల జాబితాను కుదించింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులను అర్హుల జాబితా నుంచి తొలగించింది. చివరికి గతేడాది ఆగస్టులో మాఫీ ప్రక్రియ ప్రారంభించింది. ఆధార్, బ్యాంకు ఖాతా, పాస్‌బుక్‌లలో తప్పులు లాంటివి సరి చేసి నాలుగు విడతల్లో రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేసింది. వడ్డీతో కలిపి రూ. 2 లక్షల రుణం దాటినవారికి ఇప్పటికీ రుణమాఫీ వర్తించలేదు. అలాగే సాంకేతిక సమస్యలతో పలువురికి సంబంధించిన రూ.2 లక్షలలోపు రుణాలు కూడా మాఫీ కాలేదు.

సగం మంది ఎదురుచూపులు..

రుణమాఫీ కటాఫ్ తేదీ నాటికి జిల్లాలో 1,98,374 మంది రైతులు వివిధ బ్యాంకుల్లో రుణాలు పొంది ఉన్నారు. ఇందులో మొదటి విడతలో 49,540 మందికి, రెండో విడతలో 24,816 మందికి, మూడో విడతలో 16,903 మందికి, నాలుగో విడతలో 8,942 మందికి రుణమాఫీ అయ్యింది. నాలుగు విడతల్లో కలిపి 1,00,201 మంది రైతులకుగాను రూ.717 కోట్లు రైతులకు అందాయి. మరో 98 వేల మంది రైతులకు నిరాశే మిగిలింది.

సర్కారు స్పందించేనా

కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రూ. 2 లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని రైతులు చెల్లిస్తే రుణమాఫీ చేస్తామని పేర్కొంది. దీంతో చాలామంది రైతులు రూ. 2 లక్షలకుపైన ఉన్న అప్పును తీర్చేశారు. అయినా సర్కారు వీరి విషయాన్ని పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలు సైతం ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. తమ పంట రుణాలను మాఫీ చేసి రుణ విముక్తులను చేయాలని కోరుతున్నారు.

ఎన్‌పీఏ తగ్గింపునకు మరింత కృషి చేయాలి

- ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి
- బ్యాంకు సిబ్బందికి అభినందనలు



సహకార శాఖ అధికారులను అభినందిస్తున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్ : బ్యాంకు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) తగ్గింపునకు మరింత కృషి చేయాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రమేశ్ రెడ్డి శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్రాంచీల వారీగా పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం (2024–25) ఫలితాలు అందరి కృషికి నిదర్శనమన్నారు. రాష్ట్రస్థాయిలో ఎన్‌డీసీసీబీ అన్నిరంగాల్లో వెనకబడిపోయిందనే పేరు ఉందని, ప్రస్తుత ఫలితాలతో ఆ పేరు తొలగిపోయిందని హర్షం వ్యక్తంచేశారు. ఎన్‌పీఏను గణనీయంగా తగ్గించేందుకు శాఖ అధికారులు, సిబ్బంది అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రతి ఉద్యోగి తనకు తానుగా లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ దిశగా ప్రయత్నం చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా ఇవే ఫలితాలు పునరావృతం కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. తద్వారా బ్యాంకు అన్ని విభాగాల్లో పటిష్టంగా ఉంటూ రాష్ట్రస్థాయిలో పూర్వవైభవాన్ని, శోభను కీర్తిస్తుందని తెలిపారు. ఇంతటి ఘనతను విశేషంగా కృషి చేసి, రోజువారీ కార్యక్రమాల్లో మార్గనిర్దేశం చేసిన ఉన్నతాధికారులను అభినందించి, సీఈవో నాగభూషణం వందే, ఎస్‌సీడీఆర్ వసంతను శాలువాతో సన్మానించారు. వివిధ విభాగాలు (గృహ తార, స్వర్ణరత్న, రికవరీ చాంపియన్)లో ఉత్తమ ప్రతిభ చూపిన శాఖాధికారులకు జ్ఞాపికతోపాటు నగదు బహుమతి అందజేశారు. సమావేశంలో సీనియర్ బ్యాంకు అధికారులు లింబాద్రి, గజానంద్, అనుపమ, సుమమాల, 63 శాఖల అధికారులు పాల్గొన్నారు.

● మొక్కే కదా అని వదిలేస్తే..



జిల్లా కేంద్రంలోని తహసీల్ కార్యాలయంపై పెరుగుతున్న మొక్కలు

కామారెడ్డి తహసీల్ కార్యాలయంపై మొక్కలు పెరుగుతున్నాయి. దీంతో భవనంపై పగుళ్లు ఏర్పడుతున్నాయి. మొక్కలతో భవనానికి ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మొక్కే కదా అని నిర్లక్ష్యంగా వదిలేస్తే చెట్టై భవనానికి చేటు చేసే అవకాశాలున్నాయి. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ప్రైవేట్ వద్దు.. సర్కారే ముద్దు



ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

- పాల్వంచ హైస్కూల్‌కు అడ్మిషన్ల వెల్లువ
- ఐదు రోజుల్లో వంద మంది విద్యార్థుల చేరిక

మాచారెడ్డి: ప్రైవేట్ వద్దు.. సర్కార్ బడి ముద్దు అంటూ పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చేరడానికి విద్యార్థులు క్యూ కడుతున్నారు. ఈ పాఠశాలలో ఐదు రోజుల్లోనే వంద మంది అడ్మిషన్ తీసుకున్నారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో వంద అడ్మిషన్లు అయిన సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ కొత్తగా అడ్మిషన్ తీసుకున్న వారితో కలిపి మొత్తం విద్యార్థుల సంఖ్య 591కి చేరిందన్నారు. ప్రస్తుతం పదో తరగతిలో 130 మంది విద్యార్థులున్నారన్నారు. 6 నుంచి 9 వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుంటున్నామని, మరో వంద మంది వరకు చేరే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందిస్తున్నందునే తమ బడిలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల్‌రాజు, మల్లేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గది ఒకటి.. తరగతులు రెండు

- ఒకదాంట్లో 6, 7, మరొకదాంట్లో 9, 10 తరగతుల నిర్వహణ
- రామారెడ్డి హైస్కూల్‌లో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- అదనపు గదులు నిర్మించాలని కోరుతున్న తల్లిదండ్రులు





ఒకే గదిలో 9, 10 తరగతులకు పాఠాలు బోధిస్తున్న టీచర్, ఇంకోగదిలో 6, 7 తరగతుల నిర్వహణ..

రామారెడ్డి : శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించిన అధికారులు.. అవసరమైన తరగతి గదుల నిర్మాణంపై దృష్టి సారించలేదు. దీంతో ఒకే గదిలో రెండు రెండు తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాలకుల నిర్లక్ష్యంతో రామారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.

రామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో కొన్ని గదులను తొలగించారు. ప్రస్తుతం 5 గదులు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఒక గదిని స్టాఫ్ రూంగా వినియోగిస్తుండగా.. మరో గదిని కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు క్రీడా సామగ్రి నిల్వ చేయడానికి ఉపయోగిస్తున్నారు. దీంతో మిగిలిన మూడు గదుల్లో ఐదు తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 6, 7 తరగతులు ఒక గదిలో, 9. 10 తరగతులు మరో గదిలో నిర్వహిస్తున్నారు. గతేడాది పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నారు. తొమ్మిదో తరగతిలో 13 మంది, పదో తరగతిలో 20 మంది విద్యార్థులు ఉండడంతో ఒకే తరగతిలో అల్మారాలు అడ్డుపెట్టి పాఠాలు బోధించారు. అయితే ఈసారి తొమ్మిదో తరగతిలో అడ్మిషన్లు పెరిగాయి. పదో తరగతిలో 12 మంది విద్యార్థులే ఉన్నా.. తొమ్మిదో తరగతిలో 40 మంది విద్యార్థులున్నారు. దీంతో ఒకే గదిలో రెండు తరగతులకు పాఠాలు బోధించడం ఇబ్బందికరంగా మారింది. రెండు తరగతి గదులు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ప్రాథమిక పాఠశాలలోనూ తరగతి గదుల కొరత ఉంది. పాలకులు స్పందించి వెంటనే తరగతి గదులు మంజూరు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అదనపు గదులు నిర్మించాలి



పాఠశాలలో తరగతి గదుల కొరత ఉంది. ఐదు తరగతులకు మూడే గదులున్నాయి. దీంతో 6, 7 తరగతులు ఒక గదిలో, 9, 10 తరగతులు మరో గదిలో నిర్వహిస్తున్నాం. అదనపు తరగతి గదులు నిర్మిస్తే సమస్య ఉండదు.

– ఆనంద్, హెచ్‌ఎం, రామారెడ్డి హైస్కూల్

త్వరగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



బాన్సువాడ బీడీ వర్కర్స్ కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

బాన్సువాడ : ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కలెక్టర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు త్వరగా పనులు మొదలుపెట్టాలని సూచించారు.

కలెక్టర్ దృష్టికి సమస్య..

బీడీ వర్కర్స్ కాలనీలో కలెక్టర్ భూమి పూజ చేసిన ఇందిరమ్మ లబ్ధిదారుడి ప్లాట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ విషయాన్ని లబ్ధిదారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పాత బాన్సువాడ సహకార సంఘంలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. సన్న బియ్యం పంపిణీ ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమాలలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ప్రత్యేకాధికారి రాజు, డీఎల్‌పీవో సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. ఆరోగ్యం బాగుందా?

నస్రుల్లాబాద్: ''అమ్మా ఆరోగ్యం బాగుందా?'' అంటూ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నెమ్లి వెల్‌నెస్ సెంటర్‌లోని రోగులను పలకరించారు. వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. బుధవారం ఆయన వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. వైద్యులు అందిస్తున్న సేవలను గమనించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. మందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలతో మాట్లాడి వెల్‌నెస్ సెంటర్‌లో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ కిరణ్మయి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీడీవో సూర్యకాంత్, ఆరోగ్య శాఖ సిబ్బంది రవీందర్, సుశీల, స్రవంతి ఉన్నారు.

రెవెన్యూ సదస్సులో..

భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. బుధవారం నెమ్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సర్వే చేపట్టి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ కిరణ్మయి, మండల ప్రత్యేకాధికారి దయానంద్, తహసీల్దార్ సువర్ణ, ఆర్‌ఐ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

'మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి క్రైం: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం నార్కొటిక్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 26 న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంతరావు, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు, డీపీవో తిరుమల ప్రసాద్, యాంటీ నార్కొటిక్ విభాగం డీఎస్పీ సోమనాథం, డీసీపీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

'బ్యాంకు రుణాలు ఇప్పించాలి'



మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగరాణి

కామారెడ్డి టౌన్: అధిక వడ్డీల భారంనుంచి రైతులను తప్పించడానికి బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి వ్యవసాయ అధికారులకు సూచించారు. బుధవారం చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వ్యవసాయ శాఖలు కలిసి బ్యాంక్ అధికారులతో రైతులకు రుణాల మార్పిడి, మంజూరుపై న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అవగాహన లోపంతో రైతులు అధిక వడ్డీలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేస్తున్నారన్నారు. దీనివల్ల అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొని ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందడానికి వ్యవసాయ అధికారులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, ఏడీఏ అపర్ణ, ఏవోలు, ఏఈఓలు, బ్యాంక్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిగ్రీ దోస్త్‌లో ఆర్ట్స్ కళాశాలను ఎంపిక చేసుకోండి

కామారెడ్డి అర్బన్: డిగ్రీలో ప్రవేశాలకు దోస్త్ మూడవ దశలో ఎంపికవ్వడానికి 19న చివరి అవకాశం ఉన్నందున విద్యార్థులు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి)ను తొలి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకుని నాణ్యమైన విద్య పొందాలని ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన ప్రకటన చేశారు. కళాశాలలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందే బీబీఏ, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ కంప్యూటర్స్ హానర్స్ లాంటి కోర్సులున్నాయని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): వనమహోత్సవం కార్యక్రమానికి స్థలాలు ఎంపిక చేసుకొని మొక్కలు నాటడానికి నర్సరీల్లోని మొక్కలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయించాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మాణాలు చేపట్టని వారి నుంచి, ఇల్లు నిర్మించుకోవాలని ఆసక్తి లేని వారి నుంచి లెటర్లు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



బాన్సువాడ: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన సంకల్ప సభలో భాగంగా బుధవారం బాన్సువాడలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పట్టణంలోని రామాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చినరాజులు మొక్కలు నాటి మాట్లాడారు. గత 11 ఏళ్ల కాలంలో మోదీ నాయకత్వంలో అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతోందని అన్నారు. కేంద్ర పథకాలు ప్రతీ పౌరుడికి చేరడమే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. బీజేపీ నాయకులు కోనాల గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, చిదరి సాయిలు, కొండని గంగారం, చీకట్ల రాజు, అనిల్, భాస్కర్‌రెడ్డి, వెంకట్ తదితరులున్నారు.

రైతుల ఖాతాల్లో రూ.17.36 కోట్ల జమ

బాన్సువాడ: బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన 27,536 మంది రైతులకు బుధవారం వరకు రూ.17.36 కోట్ల మేరకు రైతు భరోసా నిధులు జమ అయ్యాయని బాన్సువాడ ఏడీఏ అరుణ తెలిపారు. రైతులు అప్పుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా ఉండేందుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించిందని ఆమె సూచించారు.

సదాశివనగర్ పరిధిలో రూ.9.66 కోట్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13,158 మంది రైతులకు రైతుభరోసా కింద డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఏవో ప్రజాపతి తెలిపారు. రూ.9కోట్ల 66లక్షల 31వేల 618లను జమ చేసినట్లు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు ముదాం భీంరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు దేమె కమ్మరి రాజు, మాజీ జడ్పీటీసీ జయరాజ్, అవుసుల లక్ష్మణ్, వెంకటరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరిసి..

- కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు
- నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న వైనం
- లైఫ్ ఎన్‌జీవో సంస్థ ద్వారా ఉచిత శిక్షణ



కామారెడ్డి ఎస్పీగా పనిచేసిన శ్వేత చేతుల మీదుగా పేద కుటుంబాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న లైఫ్ ఎన్‌జీవో సంస్థ ప్రతినిధులు(ఫైల్)

దోమకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పేదరికంలో పెరిగి ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించి నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు దోమకొండ మండల కేంద్రానికి చెందిన పలువురు యువతీ యువకులు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాలల్లో వీరు చదివారు. బీడీ కార్మిక కుటుంబాల నుంచి స్కాలర్‌షిప్‌ల సాయంతో చదువులు కొనసాగించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు. పదవ తరగతితో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో వీరు విద్యనభ్యసించి మంచి ప్రతిభ చూపారు. వీరి ప్రతిభను గుర్తించిన హైద్రాబాద్‌కు చెందిన లైఫ్ ఎన్‌జీవో సంస్థ స్కాలర్‌షిప్ అందించి డిగ్రీ అనంతరం వీరికి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇచ్చారు. అనంతరం వీరు పలు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, డిగ్రీ చదువుతో కార్పొరేట్ కంపెనీల్లో మండలానికి చెందిన పలువురు యువతీ యువకులు ఉద్యోగాలు సాధించారు. బీడీ కార్మిక, నిరుపేద కుటుంబాలకు చెందిన వీరు కార్పొరేట్ సంస్థలో ఉద్యోగాలు సాధించి పుట్టిన ఊరితో పాటు పలువురికి ఆదర్శంగా నిలిచారు. హైద్రాబాద్‌లో లైఫ్ ఎన్‌జీవో సంస్థను దోమకొండకు చెందిన దేవరగట్టు బాలప్రసాద్ నిర్వహిస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన, ప్రతిభ ఉన్న యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇచ్చి కార్పొరేట్ కంపెనీలకు ఇంటర్వ్యూలకు పంపిస్తారు. బాల ప్రసాద్ తన మిత్రులతో కలిసి లైఫ్ ఎన్‌జీవో సంస్థను 2017 ఏర్పాటు చేశారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి స్కాలర్‌షిప్‌ను సైతం అందిస్తూ ప్రోత్సహించి డిగ్రీ అనంతరం శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగాల్లో అండగా నిలుస్తున్నారు.

స్కాలర్‌షిప్, ఉచిత శిక్షణతో..



మాది దోమకొండ మండల కేంద్రం. ఇక్కడి ప్రభుత్వ బాలికల పాఠశాలలో పదవ తరగతి వరకు, కామారెడ్డిలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాను. మా నాన్న ఎలక్ట్రీషియన్. అమ్మ బీడీలు చుడుతుంది. పదవ తరగతిలో మంచి మార్కులు రాగా లైఫ్ ఎన్‌జీవో ప్రతినిధి బాలప్రసాద్ స్కాలర్‌షిప్ అందించారు. డిగ్రీ పూర్తి కాగానే ఉచితంగా శిక్షణ ఇచ్చారు. దీంతో మూడు నెలల క్రితం హైద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం సాధించాను. చాలా సంతోషంగా ఉంది.

– బందం ప్రవళిక, దోమకొండ

బీడీ కార్మిక కుటుంబం నుంచి..



మాది దోమకొండ మండల కేంద్రం. నాన్న బీడీ కంపెనీలో పనిచేసేవారు. అమ్మ బీడీలు చుడుతుంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నాను. కామారెడ్డి ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశాను. డిగ్రీ వరకు లైఫ్ ఎన్‌జీవో సంస్థ తరఫున స్కాలర్‌షిప్ అందజేశారు. డిగ్రీ పూర్తికాగానే కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం ఎలా సాధించాలో శిక్షణ ఇచ్చారు. దీంతో కార్పొరేట్ కంపెనీలో హైద్రాబాద్‌లో జాబ్ వచ్చింది.

– కూచని శ్రావణి, దోమకొండ

పేదరికం అడ్డుకాకూడదని..



2017లో లైఫ్ ఎన్‌జీవో సంస్థను ఏర్పాటు చేశాం. దోమకొండతో పాటు తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో చదువులో ప్రతిభ కనబర్చిన పేదలకు సహాయం అందించాం. గత రెండేళ్లలో 468 మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం లైఫ్ ఎన్‌జీవో తరఫున ఉచితంగా శిక్షణ ఇచ్చాం. గ్రామీణ ప్రాంత పేద కుటుంబాల వారు చదువుతోనే తమ భవిష్యత్తును మార్చుకుని నేటి యువతకు ఆదర్శంగా ఉండాలనేది నా కోరిక.

– బాలప్రసాద్, లైఫ్ ఎన్‌జీవో ప్రతినిధి, హైదరాబాద్

డివిజన్‌లోనే మొదటి ప్రభుత్వ కాలేజీ

మీకు తెలుసా?



ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనం

ఆర్మూర్ డివిజన్‌లో మొట్టమొదటి ప్రభుత్వ జూనియర్ కళాశాల పిప్రి రోడ్‌లో ఏర్పాటు చేశారన్న విషయం ఎంతమందికి తెలుసు?

- 1969లో పిప్రి రోడ్డులో నెలకొల్పిన ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే జూనియర్ కళాశాలను సైతం నిర్వహించే వారు.
- 1996లో డిగ్రీ కళాశాల నుంచి వేరు చేస్తూ బాలుర జూనియర్ కళాశాలను పిప్రి రోడ్‌లో, బాలికల జూనియర్ కళాశాలను ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.
- 2016 విద్యా సంవత్సరంలో పిప్రి రోడ్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను కో ఎడ్యుకేషన్ కళాశాలగా ప్రభుత్వం మార్చింది.
- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను మాత్రం బాలికల కళాశాలగానే నిర్వహిస్తున్నారు.
- అదే సమయంలో ఆర్మూర్ పట్టణంలో ప్రైవేటు జూనియర్ కళాశాలలను పెద్ద ఎత్తున స్థాపించడంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో క్రమంగా బాలుర జూనియర్ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం మానేశారు.
- ప్రస్తుతం ఈ కళాశాలలో తెలుగు మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులతోపాటు కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ ఒకేషనల్ కోర్సును నిర్వహిస్తున్నారు.

– అడ్మిషన్ల కోసం కళాశాల ప్రిన్సిపల్ విజయానంద్ రెడ్డిని 94408 27986 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– ఆర్మూర్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



అన్నాసాగర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

ఎల్లారెడ్డి: రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. బుధవారం అన్నాసాగర్‌లో నిర్వహిస్తున్న సదస్సును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎలాంటి భూసమస్యలున్నా భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులను అందించాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

గుజ్జుల్ తండాలో..

గాంధారి(ఎల్లారెడ్డి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. బుధవారం ఆయన గుజ్జుల్ తండాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

ఎల్లారెడ్డిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. బుధవారం అన్నాసాగర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారం వివరాలను చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ప్రేమ్ కుమార్, అంగన్‌వాడి టీచర్ దుర్గ తదితరులున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



బిచ్కుంద మండలం పుల్కల్‌లో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పెద్దకొడప్‌గల్/బిచ్కుంద(జుక్కల్): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. బుధవారం బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ మండలాలలో నిర్వహించిన సదస్సులలో సబ్ కలెక్టర్ పాల్గొని పరిశీలించి మాట్లాడారు. భూ భారతితో ఎన్నో భూముల సమస్యలు పరిష్కరించారని తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా దరఖాస్తు పెట్టుకున్న వెంటనే అధికారులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. బిచ్కుందలో 141, పుల్కల్‌లో 209 మంది రైతులు దరఖాస్తులు పెట్టుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, డీటీ భరత్.. పెద్దకొడప్‌గల్‌లో తహసీల్దార్ దశరథ్, నాయబ్ తహసీల్దార్ రవి కాంత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత మాటలను నమ్మొద్దు

నిజాంసాగర్(జుక్కల్): అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. బుధవారం మాగి గేటు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ జయప్రదీప్ మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు జుక్కల్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారన్నారు. నాయకులు ప్రజా పండరి, గుర్రపు శ్రీనివాస్, లక్ష్మయ్య, బాల్‌సాయిలు, తదితరులున్నారు.

మోదీ పథకాలను ప్రజలకు వివరించాలి



బుచ్చిరాజును సన్మానిస్తున్న కుంట లక్ష్మారెడ్డి

దోమకొండ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేసిన, చేస్తోన్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కుంట లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం దోమకొండలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం గ్రామ బీజేపీ అధ్యక్షుడిగా ముత్తి బుచ్చిరాజును ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, కార్యదర్శి అంజిరెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నేతలు మహేందర్‌గౌడ్, తిరుపతిరెడ్డి మహేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

'మా పాఠశాలను దొంగల బారి నుంచి కాపాడండి'



ర్యాలీలో ప్లకార్డులను చూపుతున్న విద్యార్థులు

రాజంపేట: తమ పాఠశాలను దొంగలబారి నుంచి కాపాడాలని కోరుతూ రాజంపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో ఉన్న ఓ బాత్ రూం డోరును రెండు రోజుల క్రితం గుర్తు తెలియని దుండగులు అపహరించగా మంగళవారం రాత్రి మరో బాత్‌రూం డోరు సైతం అపహరణకు గురైందని తెలిపారు. అలాగే పాఠశాల ఆవరణలో ఉన్న నల్లాల ట్యాబ్‌లు పలుమార్లు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. పాఠశాల ఆస్తులను కాపాడుకోవడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, పిల్లల తల్లిదండ్రులు సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. చోరీ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

రెంజల్(బోధన్): మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన భువనేశ్వరి(40) మానసిక పరిస్థితి బాగోలేక బాత్‌రూంలోని ఇనుప పైపులకు ఉరేసుకుని మంగళవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు వెంటనే నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో భువనేశ్వరి మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి మరొకరు..

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రానికి చెందిన సూదం గంగామణి (52) స్థానిక చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. భర్త మందలించాడని మనస్తాపంతో మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన గంగామణి బుధవారం పోతంగల్ గ్రామ చెరువులో మృతదేహమై కనిపించింది. కొడుకు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన యువకుడు..



హరీశ్(ఫైల్)

మాక్లూర్ : పొలానికి వెళ్లొస్తానని చెప్పి మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అడవిమామిడిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. అడవిమామిడిపల్లికి చెందిన గంగోనె హరీశ్(34) మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అదే రోజు రాత్రి హరీశ్ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం స్థానికంగా ఉన్న అటవీ ప్రాంతంలో హరీశ్ ఓ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పశువుల కాపర్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతుడి కుటుంబసభ్యుడైన నారాయణ ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. హరీశ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదని వివరించారు.

గుండెపోటుతో ఒకరి మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని నాగ్లూర్ గ్రామానికి చెందిన కంది సంజీవులు(32) గుండెపోటుతో బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సంజీవులు ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో బంధువులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మూడు రోజుల జైలు

మోపాల్: మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్‌కు చెందిన మహ్మద్ నయీమ్ మద్యం సేవించి వాహనం నడుపుతూ మోపాల్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అతడిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నూర్జహాన్ బేగం మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

ఇందల్వాయి: కోతులను తరిమే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని గంగారాం తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్ నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన భగవాన్ లాల్ గంగారాం తండాలో అద్దె ఇంట్లో ఉంటూ ఐస్‌క్రీమ్ తయారు చేసి గ్రామాల్లో విక్రయించేవాడు. బుధవారం ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తుండగా కోతులు గుంపుగా రావడంతో ఐరన్ పైప్ తీసుకొని బిల్డింగ్ పైకి వాటిని తరిమే క్రమంలో పైపు 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో భగవాన్‌లాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య మంజులా దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల దాడి.. 13 మందికి గాయాలు



బాలుడికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ధర్పల్లి: ధర్పల్లి మండల కేంద్రంతోపాటు దమ్మన్నపేట గ్రామంలో బుధవారం పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. రెండు గ్రామాల్లో కనిపించిన వారిని కనిపించినట్లే కరుస్తూ వెళ్లాయి. పిచ్చికుక్కల దాడిలో 13 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులకు ధర్పల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. దమ్మన్నపేటలో ఇద్దరు చిన్నారుల ముఖంపై తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పిచ్చికుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

'కొత్త పెన్షన్ చట్టాన్ని వ్యతిరేకించాలి'



పెన్షన్ వివరాల ప్రతులను అందజేస్తున్న ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: పార్లమెంట్ ఆమోదంతో ముందుకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ కొత్త పెన్షన్ చట్టం పెన్షనర్ల జీవితాలపై ఆశనిపాతం కానున్నందున.. దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారుడు జి.లచ్చయ్య పిలుపునిచ్చారు. బుధవారం అసోసియేషన్ జిల్లా సమావేశం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో జరిగింది. లచ్చయ్య మాట్లాడుతూ.. నూతన పెన్షన్ వచ్చే జనవరి 1 నుంచి రిటైర్డ్ అయ్యే వారికి వర్తిస్తుందన్నారు. కొత్త చట్టం అమలు నిలిపివేయాలని దేశ వ్యాప్తంగా సంతకాల ఉద్యమం చేపట్టి ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం పెన్షన్ వివరాల కరపత్రాలను అందించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయరామరాజు, ఉపాధ్యక్షులు శంకరయ్య, ప్రతినిధులు రవీందర్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా టీచర్లు చైతన్య, స్రవంతి, అజయ్, ప్రిన్స్‌పల్ సురేఖ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ స్టేజీ వద్ద గల మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా డే నిర్వహించారు.

ఈ సందర్భంగా యోగ శిక్షకురాలు భార్గవి మాట్లాడుతూ...ప్రతి విద్యార్థి చదువుతో పాటు యోగా నేర్చుకోవాలన్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. సదాశివనగర్ ఆయుశ్ వైద్యాధికారి నాహిద, కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.



తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

బ్రిడ్జి గుంతలో పడిన కారు

- ప్రమాదంలో ఇద్దరు మృతి
- ముగ్గురి పరిస్థితి విషమం



పీర్యా (35)



డ్రైవర్ పీర్యా (32)




పోచారం కాలువ బ్రిడ్జి గుంతలో పడిన కారు

ఎల్లారెడ్డిరూరల్: మల్లయ్యపల్లి శివారులో పోచారం ప్రధాన కాలువపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి గుంతలో కారు ప్రమాదవశాత్తూ పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని నర్సింగ్‌రావుపల్లి తండాకు చెందిన పీర్యా తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి నిజామాబాద్ జిల్లా పెద్దగుట్టకు కారులో వెళ్తుండగా మల్లయ్యపల్లి వద్ద పోచారం కాలువ బ్రిడ్జి నిర్మాణ గుంతలో పడింది. పెద్దగుట్టలో శుక్రవారం రోజున కందూరు చేసుకునేందుకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా పీర్యా తన తమ్ముడు వేణుతో పాటు ఇద్దరు కుమారులు సోను, ప్రవీణ్‌లతో పాటు డ్రైవర్‌ను వెంట తీసుకుని వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో డ్రైవర్ పీర్యా(32) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో నలుగురిని ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. ఆస్పత్రిలో పీర్యా(35) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వేణు, సోను, ప్రవీణ్‌ల పరిస్థితి సైతం విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

- రోడ్డు పనుల్లో నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు సిద్ధమైన గ్రామస్తులు



తీవ్రంగా గాయపడిన దిగంబరశర్మ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన వేదపండితుడు దిగంబర శర్మ బుధవారం సాయంత్రం బైక్‌పై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. కాగా, దిగంబర శర్మ బైక్‌పై నుంచి పడడానికి జాతీయ రహదారి పనులు చేపడుతున్న కార్మికుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. గోపాల్‌పేట నుంచి మాల్తుమ్మెదకు దిగంబర శర్మ వెళ్తుండగా మాల్తుమ్మెద గేట్ సమీపంలో జాతీయ రహదారి పనులు చేపట్టిన కార్మికులు తారురోడ్డు ముక్కలను తొలగించి విసిరేసే క్రమంలో కొన్ని ముక్కలు ఆయన బైక్‌కు తగిలాయి. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మెదక్ తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు హైదరాబాద్ తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన కేసీపీ కార్మికుల తీరును నిరసిస్తూ స్థానిక నాయకులు ఆందోళనకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్సై మల్లారెడ్డి అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. కేసీపీ జనరల్ మేనేజర్ రాంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొగా స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితర నాయకులు ఆయనను నిలదీశారు. సంస్థ ఉన్నతాధికారులతో మాట్లాడి బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తామని రాంరెడ్డి హామీ ఇచ్చారు.